www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 8 మే 2024 | 8 పేజీలు





ఏలూరు | పశ్చిమ గోదావరి

కాయ్.. రాజా కాయ్..!



- అభ్యర్థి గెలుపు, మెజార్టీలపై పందేల హోరు
- పలు నియోజకవర్గాల్లో కోసు పందేల జోరు
- దెందులూరు, ఉండి వంటి స్థానాల్లో పోరు రసవత్తరం
- గెలుపోటములపై ఎవరి లెక్కలు వారివే
- ఎన్నికల సర్వేల ఆధారంగా పందేలకు సై

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది బెట్టింగుల జోరు ఊపందుకుంది. ప్రతి నియోజకవర్గంలోనూ అభ్యర్థి గెలుపు, మెజార్టీలపై పందేలు హోరెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అక్కడా, ఇక్కడా అనే తేడా లేకుండా ప్రతి నియోజకవర్గంలోనూ పందేలు సాగుతున్నాయి. దెందులూరు, ఉండి వంటి నియోజకవర్గాల్లో రాజకీయం రసవత్తరంగా మారడంతో పందెంరాయుళ్లు అదేస్థాయిలో రెచ్చిపోతున్నారు. నరసాపురంలో ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారంటూ కోసు పందేలు సైతం వేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యధిక పందేలు అభ్యర్థి గెలుపుపై సాగుతుండగా, అభ్యర్థి గెలుస్తాడన్న ధీమా ఉన్న నియోజకవర్గాల్లో మెజార్టీపైనా పందేలు కాస్తున్నారు. ఎన్నికల పందేల్లో విచిత్రమైన పరిస్థితి కన్పిస్తోంది. వైసిపి అభిమానులు టిడిపి గెలుస్తుందని పందేలు కాస్తుండగా, టిడిపి అభిమానులు వైసిపి అభ్యర్థులు గెలుస్తారని పందేలు కాస్తుండటం గమనార్హం. ముఖ్యంగా వివిధ సంస్థలు విడుదల చేస్తున్న సర్వేల ఆధారంగా పందేల జోరు ఊపందుకుంటుంది. ఆచంట నియోజకవర్గంలో టిడిపి నుంచి పితాని సత్యనారాయణ, వైసిపి నుంచి చెరుకువాడ రంగనాథరాజు నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. ఆర్థికంగా బలమైన అభ్యర్థులు కావడంతో గెలుపుపై ఇరువురు ధీమాగా ఉన్నారు. దీంతో ఇక్కడ అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా పందేలు సాగుతున్నాయి. పాలకొల్లులో గడిచిన రెండుసార్లుగా టిడిపి తరపున నిమ్మల రామానాయుడు గెలిచారు. ఈసారి వైసిపి నుంచి గుడాల గోపి, టిడిపి నుంచి రామానాయుడు తలపడుతున్నారు. నిమ్మల మూడోసారి గెలుస్తాడని కొంతమంది పందేలు కాస్తుండగా, ఈసారి గోపీ గెలుస్తారని మరికొంత మంది పందేలు కాస్తున్నారు. ఇక్కడ అభ్యర్థుల మెజార్టీపై పందేలు సాగుతున్నాయి. నరసాపురంలోనూ అభ్యర్థి గెలుపు, మెజార్టీపైనా పందేలు జోరుగా సాగుతున్నాయి. భీమవరంలో వైసిపి నుంచి గ్రంధి శ్రీనివాస్, జనసేన నుంచి పులపర్తి రామాంజనేయులు తలపడుతున్నారు. ఈ స్థానంలో పందేలు పెద్దఎత్తున సాగుతున్నాయి. అభ్యర్థి గెలుపుకంటే మెజార్టీపైనే ఎక్కువ బెట్టింగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఉండిలో టిడిపి నుంచి పోటీ చేస్తున్న రఘురామకృష్ణంరాజు గెలుపోటములపై ఎక్కువగా పందేలు నడుస్తున్నాయి. తాడేపల్లిగూడెం, తణుకులోనూ అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా బెట్టింగులు కడుతున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో టిడిపి నుంచి చింతమనేని ప్రభాకర్, వైసిపి నుంచి అబ్బాయిచౌదరి మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు ఉంది. దీంతో ఇక్కడ పందేలు మరింత ఎక్కువగా సాగుతున్నాయి. విజేత ఎవరైనా అతి తక్కువ మెజార్టీనే వస్తుందని లెక్కలు కడుతూ మెజార్టీపైనే పందేలు సాగుతున్నాయి. ఏలూరులో అభ్యర్థి గెలుపుపై ఎక్కువగా పందేలు సాగుతున్నాయి. నూజివీడు, చింతలపూడిలో అభ్యర్థి గెలుపుపై పందేలు సాగుతుండగా, కైకలూరులో అభ్యర్థి మెజార్టీపై పందేలు ఎక్కువగా సాగుతున్నాయి. పోలవరంలో మాత్రం పందేల జోరు కొంత తక్కువగా ఉంది. ఎంపీ స్థానాలపైనా పందేలు పడుతున్నారు. ఏలూరు, నరసాపురం ఎంపీ స్థానాలు ఏ పార్టీ గెలుచుకుంటుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.20 కోట్లకుపైగా పందేలు ఉంటాయని అంచనా. కొంతమంది ఒక్కటిగా కలిసి తలోకొంత వేసుకుని పందేలు కడుతున్నారు. మధ్యవర్తుల ద్వారా ఈ పందేలు సాగుతున్నాయి. పందేలు కాసేవారు మధ్యవర్తిని కలిసి ..6లో

వర్ష బీభత్సం..!

- బలమైన ఈదురుగాలులు.. ఉరుములు, పిడుగులతో జనం బెంబేలు
- పిడుగుపాటుకు ఇద్దరు, వేర్వేరు ఘటనల్లో ఇద్దరు రైతులు దుర్మరణం
- పలుచోట్ల నిలిచిన విద్యుత్ సరఫరా
- తడిచి ముద్దయిన ధాన్యం, మొక్కజొన్న - నేలనంటిన అరటి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మంగళవారం సాయంత్రం వర్షం భీబత్సం సృష్టించింది. ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టాన్ని మిగిల్చి తీరని వేదన నింపింది. మండువేసవిలో చల్లని గాలులు ఉపశమనం కలిగించాయనుకుంటున్న తరుణంలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందడం, వర్షానికి తడిచిపోకుండా ధాన్యాన్ని రక్షించుకునే హడావుడిలో ఇద్దరు అన్నదాతలు ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలిచివేసింది. మంగళవారం ఉదయం నుంచి వాతావరణంలో స్వల్ప మార్పులు కన్పించినా మధ్యాహ్న సమయంలో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. కొద్దిసేపటికే బలమైన ఈదురుగాలులు ప్రారంభమై వర్షం కురిసింది. ఈ సమయంలో ఉరుములు, మెరుపులు జనాన్ని భయాందోళనకు గురి చేశాయి. పలు ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం, ధాన్యం బస్తాలు, మొక్కజొన్న కండెలు, ఎండుమిర్చి తడిచి ముద్దయ్యాయి. పలుచోట్ల అరటి తోటలు నేలనంటాయి. గాలులకు విద్యుత్ స్తంభాలకు విరిగిపడి తీగలు తెగిపోయాయి. దీంతో పలుచోట్ల విద్యుత్ సరఫరా స్తంభించింది. ఏదేమైనా అకాల వర్షం జిల్లావాసులను భయభ్రాంతులకు గురి చేయడంతోపాటు తీవ్ర విషాదాన్ని నింపింది. 8లో..



పరస రామారావు



పరస రామారావు



శివయ్య (ఫైల్‌ఫోటో)



శ్రీనివాస్ (ఫైల్‌ఫోటో)

కొనసాగిన పోస్టల్ ఓటింగ్

ఓటుహక్కు వినియోగించుకున్న 12,773 మంది ఉద్యోగులు

11వ తేదీ వరకు ఆర్‌ఓ కార్యాలయం వద్ద పోస్టల్ ఓటింగ్‌కు అవకాశం



బారులు తీరిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లాలో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగిన ఈ ఓటింగ్ ప్రక్రియలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉద్యోగులు తరలొచ్చారు. ఉదయమే ఫెసిలిటేషన్ సెంటర్ చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం సమయంలో ఉద్యోగులు బారులు తీరారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 13,854 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి రోజు సోమవారం 7,540 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండో రోజు మంగళవారం 5,233 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండు రోజుల్లో ఆచంట నియోజకవర్గంలో 1,387 మంది, పాలకొల్లులో 2,033 మంది, నరసాపురంలో 1,489 మంది, భీమవరంలో 2,530 మంది, ఉండిలో 1,591 మంది, తణుకులో 1,943 మంది, తాడేపల్లిగూడెంలో 1,800 ..6లో

పశ్చిమను అగ్రగామిగా తీర్చిదిద్దుతా

మధ్యపేజీల్లో..

ప్రజాస్వామ్య పరిరక్షణకు 'ఇండియా'నే దిక్సూచి

గోనె సంచులివ్వాలని ఆర్‌బికె వద్ద ధర్నా

8లో..

పోలింగ్ సామగ్రి పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్



ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రం, పోలింగ్ కేంద్రాల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత ఏర్పాట్లపై అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ నెల 12న ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లను అంశాలవారీగా కలెక్టర్ సమీక్షించారు. హెల్ప్‌డెస్కుల ఏర్పాట్లు, పిఎ సిస్టమ్, తాగునీరు, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. పోలింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రణాళికాబద్దంగా అన్ని దశల్లో చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ పూర్తయిన పిదప డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుని సంబంధిత చట్టబద్ధమైన పత్రాలు, ఇతర పత్రాల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇవిఎంలు, చట్టబద్ధమైన పత్రాలు అందజేసి తిరిగి వెళ్లే సిబ్బందికి బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన లైటింగ్ సౌకర్యం కల్పించుకోవాలన్నారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్, పార్కింగ్ ప్లాన్లు ఉండాలన్నారు. ఆయా కౌంటర్లకు సంబంధించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించుకోవడంతోపాటు పోలింగ్ రోజున ఉదయం నిర్వహించే మాక్‌పోల్‌ను పటిష్టంగా నిర్వహించి అనంతరం బటన్ క్లియర్ చేసి పోలింగ్ ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌ఒలతో కూడిన ..6లో

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఈనెల 8వ తేదీ బుధవారం ద్వారకాతిరుమల సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకరు అమరుస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్‌కి అంతరాయం ఏర్పడుతుందని జెపిబి నటరాజన్ తెలిపారు. దీనివల్ల ద్వారకాతిరుమల మండల హెడ్ క్వార్టర్, ద్వారకాతిరుమల టెంపుల్‌కి, దొరసానిపాడు, సత్తెనగూడెం, రాళ్లగుంట ద్వారకాతిరుమల సబ్ స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రీస్ ఫీడర్ (సిఎస్‌ఆర్) గ్రామాలకి కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించగలరని తెలిపారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

ఎస్ఐ రాజారెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాలలో అసత్య ప్రచారాలు చేస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగించే లాగా సోషల్ మీడియా మాధ్యమాలలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏలూరు రూరల్ ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. వివరాల్లోకెళితే.. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతికోళ్లలంక గ్రామంలో కొంతమంది వ్యక్తులు రోడ్డుపై ఆటంకపరచగా వారిని దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ చౌదరి సముదాయించి పక్కకి పంపించారు తప్ప.. వాళ్లపై రాళ్లు వేయడం గానీ, దౌర్జన్యం చేయడం గాని చేయలేదని, వాస్తవం కాదని రాజారెడ్డి తెలిపారు. సదరు విషయంపై అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజ గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు మంగళవారం టిడిపిలోకి చేరారు. టిడిపి యువనేత కొడాలి వినోద్ సమక్షంలో టిడిపిలో చేరారు. యలక్కాయల వెంకటేశ్వరరావు(హైస్కూల్ ఛైర్మన్), వీరిశెట్టి శ్రీనివాసరావు, అంబటి కోటేశ్వరరావు, ముప్పిరిశెట్టి బాబురావు, తోట భాస్కర్ రావు, అంబటి చిన్న కోటేశ్వరరావు, కొమరిశెట్టి శ్రీనివాసరావు, కణజాన్ సుబ్బారావు, పల్లంపాటి పాములు, విన్నకోట కోటేశ్వరరావు, కానజం నాగరాజు, పోకల శ్రీరాములు, రామిశెట్టి నాగేశ్వరావు, పల్లంపాటి పాండురంగారావు, వీరిశెట్టి సీతారామయ్య, పోతుల రంగారావు టిడిపి తీర్థం తీసుకున్నారు.

కామినేని ప్రచారానికి వెంకటేష్ రాక

ప్రజాశక్తి - కైకలూరు

సినీనటుడు విక్టరీ వెంకటేష్ బుధవారం కైకలూరులోని ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని కామినేని కార్యాలయ సిబ్బంది తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నటుడు వెంకటేష్ కామినేని శ్రీనివాస్‌కి మద్దతు తెలుపుతూ కోరుకొల్లు గ్రామం నుంచి వేమవరప్పాడు, తామర కొల్లు, వింజరం, ఆచవరం మీదుగా కైకలూరు వచ్చి శ్రీశ్యామలాంబ అమ్మవారి గుడి వరకూ ర్యాలీగా ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారని వారు తెలిపారు.

21 కాదు 175 చోట్ల మద్దతు : పులి శ్రీరాములు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఈనెల 13న జరుగనున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో జనసేన, టిడిపి, బిజెపిల ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని కాపుసంక్షేమ సేవా సంఘ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు పులి శ్రీరాములు కాపు సామాజిక ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజావిశ్వాసం కోల్పోయిన కొందరు 21 స్థానాలలో పనిచేయండి అని లేఖలు రాస్తున్నారని, వారికి సామాజిక మద్దతు లేదన్నారు. జనసేన నేత పవన్ కళ్యాణ్ మాటే మనకు శాసనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమికి, తెలంగాణలో బిజెపి విజయానికి కృషి చేయాలని పులి శ్రీరాములు పిలుపునిచ్చారు.

మన్యం విప్లవ వీరుడు అల్లూరి

శత వర్ధంతి సందర్భంగా నివాళులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మన్యం విప్లవాన్ని నడిపిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి సందర్భంగా స్థానిక అన్నే భవనంలోని కంప్యూటర్ సెంటర్ నందు మంగళవారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ఎం.లక్ష్మీ అధ్యక్షత వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశమంతటా తిరిగి బ్రిటిష్ పరిపాలన విషయాలను, స్వతంత్ర పోరాట పద్ధతులను, ప్రజల జీవితాలను అధ్యయనం చేశారని, దానితో గిరిజనులను వారి సమస్యల మీద ఐక్యం చేయడమే కాకుండా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడే వారిగా తయారు చేశారని అన్నారు. నేటి విద్యార్థులు పుస్తకాలను, పేపర్లను చదవడం ద్వారా దేశంలో జరుగుతున్న పరిణామాల్ని తెలుసుకొని అర్థం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ విద్యార్థులు సిద్ధార్థ సాయి, జి.జ్ఞానేశ్వర్, కె.హిమబిందు, బి.అంకిత జైన్, ఎస్.వెన్నెల, కె .సాయి కుమార్, కె.సుధీర్, మోహిత్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : దళిత, గిరిజన, ప్రజల హక్కుల కోసం, భారతదేశ స్వాతంత్రం కోసం పోరాడి అతిచిన్న వయసులోనే తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కొయ్యలగూడెం పట్టణంలో యూనియన్ బ్యాంకు వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సిపిఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద ప్రజల కోసం, కష్ట జీవుల కోసం, తెల్ల దొరల నుంచి బానిసలుగా బతుకుతున్న హరిజన, గిరిజన, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల బానిస సంకెళ్లు తెంచి, బ్రిటిష్ సామ్రాజ్యంపై పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.బాజీ, బిసి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు, చెన్నూరి వీరస్వామి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం పట్టణంలో మంతెన సోమరాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పూలమాలలతో నివాళులర్పించారు. ఎంపిపి గంజిమాల రామారావు మాట్లాడుతూ మన్యం విప్లవ వీరుడు, అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పైడిముక్కల మురళీకృష్ణ, బిసి సెల్ నాయకులు కట్టా రాము, మరిసెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలపూడి: అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్రోద్యమ పోరాటానికి ఆకర్షితుడై తిరుగుబాటు ద్వారానే స్వాతంత్రం సిద్ధిస్తుందని నమ్మిన వ్యక్తి అని సిపిఎం నాయకులు సూర్యకుమార్ అన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రా అటవీ ప్రాంతాల్లో బ్రిటిష్ పాలకుల దోపిడీకి గురవుతున్న గిరిజనులను చైతన్య పరిచి, వారిలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నింపి, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి అటవీ ప్రాంత గిరిజనులను సంసిద్ధులను చేసి బ్రిటిష్ వారిపై అనేక తిరుగుబాటు ఉద్యమాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కురిసెట్టి అనురాధ పాల్గొన్నారు.

నిడమర్రు: అల్లూరి శత వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల కార్యాలయం, భువనపల్లి రావిచెట్టు సెంటర్, మూడు రోడ్ల జంక్షన్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి శత వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చిన్న వయసులోనే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. సిపిఎం, సిఐటియు నాయకులు కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కంచ వరప్రసాద్ పాల్గొన్నారు.

కామవరపుకోట: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు టివిఎస్ రాజు మాట్లాడుతూ మోగల్లులో జన్మించి అటవీ ప్రాంతాల్లో తిరుగుతూ, మన్యం ప్రజలను ఉత్తేజపరుస్తూ చైతన్య స్ఫూర్తి నింపిన మహనీయుడు అల్లూరి అన్నారు. చిన్నతనంలోనే బ్రిటిష్ వారిని ఎదిరించి వీర మరణం పొందిన దేశ భక్తుడు అల్లూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎస్.భీమరాజు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమల్ల మధు, గదుల సత్యనారాయణ, మురళీ పాల్గొన్నారు.




నిడమర్రు: నివాళులర్పిస్తున్న రమణరావు



ఏలూరు అర్బన్:పూలమాల వేస్తున్న నాయకులు

ముఖ్య వార్తలు

బుధవారం 8 మే 2024


ప్రచారంలో నితిన్‌కృష్ణ

పార్థసారథి గెలుపు కోసం కుమారుడు ప్రచారం

ప్రజాశక్తి - చాట్రాయి

టిడిపి నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి కొలుసు పార్థసారథి కుమారుడు కొలుసు నితిన్‌కృష్ణ మండలంలోని చనుబండ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే టిడిపి అభ్యర్థి పార్థసారథికి ఓటు వేసి గెలిపించుకోవాలని నితిన్ కృష్ణ అన్నారు. చనుబండ గ్రామంలోని దళిత వాడల్లో కార్యకర్తలతో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మోదుగు ముత్తయ్య, విస్సంపల్లి ప్రసాద్, మారేశ్వరరావు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారంలో నరేష్‌రాజు

'వైసిపితోనే అభివృద్ధి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

వైసిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, ఓటర్లు తిరిగి గెలిపించాలని వైసిపి ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్ రాజు కోరారు. సోమవారం సాయంత్రం, మంగళవారం ఉదయం మార్టేరు గ్రామంలో ప్రచారాన్ని నిర్వహించారు. మార్టేరు గ్రామ సర్పంచి మట్టా కుమారీ రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచార పాదయాత్రలో జెడ్‌పిటిసి సభ్యురాలు కర్రీ గౌరీ సుభాషిణి, సీనియర్ నాయకులు కర్రి వేణుబాబు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌ను గెలిపించాలి

వైసిపి మండల నాయకులు దేవరపల్లి ముత్తయ్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే పేదలకు సంక్షేమం అందుతోందని వైసిపి మండల నాయకులు దేవరపల్లి ముత్తయ్య అన్నారు. మండలంలోని ప్రకాష్ నగర్, పుట్రేపు, రుద్రకోటరాజుగూడెం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి నవరత్నాల ఎన్నికల మేనిఫెస్టో వివరించారు. ప్రతిఒక్కరూ వైసిపికి మద్దతు పలకాలని, రాష్ట్రంలో జగన్‌తో పాటు ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, పోలవరం నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిలను గెలిపించాలని కోరారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నోముల సత్యనారాయణ, కమ్మిల రమేష్ రాజు పాల్గొన్నారు.


ప్రచారంలో ముత్తయ్య

రాష్ట్రంలో జగన్ మాఫియా నడుస్తోంది

జనసేన తాడేపల్లిగూడెం అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో ల్యాండ్, ఇసుక, మద్యం అన్నింటా జగన్ మాఫియా నడుస్తోందని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెంటపాడు మండలం జట్లపాలెం, ఉమామహేశ్వరం, వెస్ట్ విప్పర్రు గ్రామాల్లో మంగళవారం బొలిశెట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థల్నీ నిర్వీర్యం చేయగా, నియోజకవర్గంలో కొట్టు మరింత అవినీతికి పాల్పడ్డాడని విమర్శించారు. వైసిపి అభ్యర్థి కొట్టు సత్యనారాయణ పేరు చెబితే చిరు వ్యాపారుల దగ్గర నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారుల వరకూ భయపడే స్థాయిలో కొట్టు దందా సాగిందన్నారు. అయినా అవినీతిపై మాట్లాడకుండా రౌడీలు అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని,


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బొలిశెట్టి

ధైర్యం ఉంటే తన సవాళ్లు స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, మండల అధ్యక్షులు పుల్ల బాబి హాజరయ్యారు.

'ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓటేయాలి'

టిడిపి దెందులూరు అభ్యర్థి చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలంతా తమ ఓటును సైకిల్ గుర్తుపై వేయాలని టిడిపి దెందులూరు ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ ఓటర్లను అభ్యర్థించారు. విస్తృత స్థాయి ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి పెదవేగి మండలంలోని భోగాపురం, అమ్మపాలెం, పెదకడిమి, పినకడిమి గ్రామాల్లో చింతమనేని ప్రభాకర్ ప్రచారం నిర్వహించారు. అశేష ప్రజాదరణ మధ్య పర్యటిస్తూ.. ప్రజలకు బాబు సూపర్ 6 పథకాలను, వైసిపి పాలనలో వైఫల్యాలను, మోసాలను వివరించారు. సన్నజీవాలు పెంచుకునే ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని, జీవాలు చనిపోతే ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. గ్రామ సమస్యలు పరిష్కరించి సంక్షేమాన్ని ప్రతి కుటుంబానికి అందిస్తామన్నారు. బాబు సూపర్ 6 పథకాలతో ప్రతి పేద కుటుంబంలో ఆర్థిక ప్రగతి జరుగుతుందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని, టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. సంపద సృష్టించి ప్రతి పేద కుటుంబానికి పథకాల రూపంలో అందిస్తామని చెప్పారు. యువతకు 20 లక్షల ఉద్యోగ ఉపాధి కల్పిస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. 50 ఏళ్లకే బిసిలకు పింఛన్లు అందిస్తామని, ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

రామసింగవరంలో అబ్బయ్య చౌదరి ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెదవేగి మండలంలోని రామసింగవరం గ్రామంలో వైసిపి దెందులూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, వైసిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించి, ఫ్యాను గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


యువతితో అబ్బయ చౌదరి సెల్ఫీ

అప్పనవీడులో ప్రజల ఆత్మీయత నడుమ కోలాహలంగా ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దెందులూరు అభివృద్ధి ప్రదాత అబ్బయ్య చౌదరి వెంటే మేమంతా అంటూ ప్రజలు నినాదాలు చేశారు. జగనన్న ప్రభుత్వంలో జరుగుతున్న ఈ సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే అందరి ఆశీస్సులు ఇలాగే తమపై ఉండాలని కోరారు. అప్పనవీడులో జరిగిన అభివృద్ధిని చూసే ఫ్యాను గుర్తుకు ఓటు వేయండని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.

మరోసారి అవకాశమివ్వండి : శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు తనకు మరొక అవకాశం ఇవ్వాలని ఉండి మాజీ ఎంఎల్ఎ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం కోలమూరు, ఉప్పులూరు, చిలుకూరు, మహదేవపట్నం, వెలివర్రు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి శివరామరాజు మాట్లాడుతూ రెండు పర్యాయాలు


వర్షంలో చెరువులో మేత వేస్తున్న శివరామరాజు

ఎంఎల్ఎగా అవకాశం కల్పించిన ఉండి నియోజకవర్గం మరొకసారి తనకు ఎంఎల్ఎగా అవకాశం కల్పించాలని అన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై తనకు అవగాహన ఉందని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సింహం గుర్తుపై ఓటు వేసి తనని గెలిపించాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం వర్షంలో చెరువులో మేత వేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఘనత జగన్‌దే

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని కొప్పర్రు, మంగళగుంట పాలెం గ్రామంలో ప్రజాశీర్వాదా ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసాదరాజు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ తిరిగి సంక్షేమ


ప్రచారంలో ముదునూరి

పథకాల అమలు కావాలంటే జగన్ రావాలన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. నరసాపురం పట్టణంలో 31వ వార్డులో ముదునూరి ప్రసాదరాజు సతీమణి శారదవాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన భర్త చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.


ఇంటింటా ప్రచారం చేస్తున్న వైసిపి నేతలు

వైసిపిని ఆదరించాలి

జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాబూజి

ప్రజాశక్తి - మొగల్తూరు

త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసిపిని ప్రజలు ఆదరించాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాబూజి ప్రజలను కోరారు. మంగళవారం మండలం రామన్నపాలెం గ్రామంలో ప్రజాశీర్వాద కార్యక్రమంలో భాగంగా నరసాపురం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజు, అల్లుడు అడ్డూరి అనిర్విన్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. వైసిపి ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు అందించి వివరించారు. సంక్షేమ పథకాల అమలు వైసిపితోనే సాధ్యమన్నారు. ఈ ప్రచారంలో ఆకన దొరబాబు, పత్తి రాంబాబు, అనంత సుబ్రహ్మణ్యం, కొడల్లి వెంకట్రావు ఉన్నారు.

ఆస్తి హక్కును హరించడమే జగన్ లక్ష్యం

టిడిపి మండల అధ్యక్షుడు దేవినేని డలరామ్

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజల ఆస్తి హక్కును హరించడమే జగన్ లక్ష్యమని టిడిపి మండల అధ్యక్షుడు దేవినేని డలరామ్ అన్నారు. మంగళవారం ముసునూరు మండల కేంద్రమైన రెవెన్యూ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్ యాక్ట్ ఎటువంటి చర్చకు తావు లేకుండా అమల్లోకి తీసుకువచ్చి, ప్రజల ఆస్తి హక్కును జగన్ రెడ్డి హరించాడన్నారు. వ్యవసాయ కమర్షియల్ భూములు కొనుగోలు చేసినా, అమ్మినా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రికార్డ్ అంతా ఓ ప్రయివేట్ సంస్థకు దారాదత్తం చేయడం ఇందుకు ఉదాహరణ అన్నారు. పన్నులు అసలేం పెంచమని వాగ్దానం చేసిన జగన్ రెడ్డి ఏ పన్ను పెంచలేదని చెప్పలేని పరిస్థితి నెలకొని ఉందన్నారు. టిడిపిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.


ప్రచారంలో మార్నీడి బాబ్జి

ఒక్క అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి మార్నీడి బాబ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తనకు ఒక్కసారి అవకాశం కల్పించాలని, సామాన్యుడుకి అవకాశం ఇస్తే తాడేపల్లిగూడెం పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని కాంగ్రెస్ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి మార్నీడి బాబ్జి అన్నారు. మంగళవారం 6, 7, 8 వార్డుల్లో, సీతారాంపేట, కొబ్బరి తోటలో గడపగడపకూ తిరిగి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పెద్దలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బర్రింకలగరువులో నోబుల్ ప్రచారం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని పడమటిపాలెం పంచాయతీ పరిధి బర్రింకలగరువులో కాంగ్రెస్ కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ, రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక బలపరిచిన తనను, కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను గెలిపించాలని కోరారు. నాయకులు ఈదా పద్మారావు, భూషణం, సైమన్ రాజు పాల్గొన్నారు.


ప్రచారంలో నోబుల్

రైతుల కష్టాలు తెలుసు

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్

ప్రజాశక్తి - చింతలపూడి

రైతుల కష్టాలు తనకు తెలుసని, రైతులను గుండెలో పెట్టుకుంటానని టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. మండలం ప్రగడవరం పంచాయతీలో 200 మంది వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పంచాయతీలో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో గెలిచేది టిడిపి ఉమ్మడి కూటమి అన్నారు. ప్రగడవరం, గొల్లగూడెంలో


మాట్లాడుతున్న పుట్టా మహేష్ యాదవ్

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వరి, మొక్కజొన్న, పామాయిల్ రైతులకు న్యాయం చేస్తామని, వారికి మద్దతు ధర కల్పిస్తామని తెలిపారు. పామాయిల్ రైతులను ప్రోత్సహించింది ఎన్‌టిఆర్ రామారావు అన్నారు. రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపిస్తానని తెలిపారు. అభివృద్ధి కావాలంటే ఉమ్మడి కూటమిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజశేఖర్‌రెడ్డి, తిరుపతిరావు, మానేపల్లి రాజారావు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటేస్తే మన భూములకు చేటు

టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకురూరల్

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకొస్తే మన భూములన్నీ లాక్కుంటారని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు నియోజకవర్గం ఇరగవరం మండలంలోని గోటేరు, కె.ఇల్లిందలపర్రు, సూరంపూడి, తూర్పువిప్పర్రు, రాపాక గ్రామాల్లో మంగళవారం రాధాకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో యువత ఉత్సాహంగా సంఘీభావం తెలియజేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ జగన్ వస్తే భూములు లాక్కోవడం ఖాయమని, జగన్‌కు ఓటు మన భూములకు చేటు అని తెలిపారు. పాస్ బుక్కులు, అడంగళ్ పత్రాలు తీసేసుకుంటారని, వాటిని తాకట్టు పెట్టుకుని ప్రభుత్వం అప్పులు తెచ్చుకుంటోందన్నారు. అందుకోసమే జగన్ బొమ్మను కూడా ముద్రిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం భూముల క్రయవిక్రయాలకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే దస్తావేజు పత్రాలు ఇస్తున్నారని, వైసిపి అధికారంలోకి వస్తే ఆ పత్రాలు తీసేసుకుని జిరాక్స్ కాగితాలు మనకు ఇస్తారని ఆయన వివరించారు. రైతు సోదరులకు పూర్తిగా అండగా నిలుస్తామని, ధాన్యం ఎక్కడ కావాలంటే అక్కడ అమ్ముకునే సౌకర్యం కల్పిస్తామన్నారు. గట్టు మీద నుంచి కావాల్సిన మిల్లుకు పంపించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తేమ శాతంతో నిమిత్తం



ప్రచారం చేస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ

లేకుండా కొనుగోళ్లు జరిపిస్తామని తెలిపారు. ఐకెపి సెంటర్ల ద్వారా ధాన్యం పట్టుబడులు జరుగుతాయన్నారు. రాబోయే కాలంలో ఇరగవరం మండలాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఏలూరులో బడేటి చంటి ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు డిబార్ చేసేందుకు సిద్ధమయ్యారని టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సంకల్పయాత్రను లక్ష్యసాధన దిశగా కొనసాగుతోంది. ఇదే తరుణంలో కూటమి అగ్ర నాయకత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందిస్తూ, ఆయా పథకాలపై వారికి అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా శనివారపుపేట ఇందిరకాలనీ, హైస్కూల్ రోడ్డులో నిర్వహించిన ప్రజా సంకల్పయాత్ర కార్యక్రమంలో చంటి


ప్రచారం చేస్తున్న బడేటి చంటి


ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 2024 ఎన్నికల్లో చరిత్రను తిరగరాసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 90 శాతం ఉద్యోగులు కూటమి వైపే ఉన్నారనడానికి పోస్టల్ బ్యాలెట్ సాక్ష్యమన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమిని ఆశీర్వదించాలని బడేటి చంటి కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ఆసరాగా ఉంటాం

భారత చైతన్య యువజన పార్టీ నరసాపురం అభ్యర్థి వెంకటస్వామి

ప్రజాశక్తి - నరసాపురం

వనితకు వందనం కార్యక్రమం ద్వారా మహిళలకు ఆరోగ్య భరోసా, ఆర్థిక భద్రత, ఆత్మ రక్షణ అన్ని విధాలా ఆసరాగా ఉంటామని భారత చైతన్య యువజన పార్టీ నరసాపురం నియోజకవర్గ అభ్యర్థి ఆకుల వెంకటస్వామి తెలిపారు. మంగళవారం పట్టణంలోని పాతబజార్, పంజా సెంటర్, పీచుపాలెం, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల వెంకటస్వామి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వరకూ పూర్తిగా ఉచిత విద్య, అమ్మాయిలకు డిగ్రీ పీజీ వరకూ ఉచితమన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం



ప్రచారం చేస్తున్న ఆకుల వెంకటస్వామి

కల్పిస్తామన్నారు. పాల డైరీలో ప్రయివేటు రంగం నుంచి సహకార రంగంలో తీసుకొచ్చి రైతులు భాగస్వామితో ప్రదీప్ మండలంలో ఒక డైరీ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికీ రూ.5 లక్షల ప్రమాద బీమా ఉచితమన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలూ ఉచితంగా నిర్వహించేలా ప్రతి నియోజకవర్గంలో ఒక ఆరోగ్య పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో చేరుకు రైతు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.



'పశ్చిమ'ను.. అగ్రగామిగా తీర్చిదిద్దుతా



ఇండియా వేదికతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

నరసాపురం ఎంపీ స్థానం హస్తగతమే

వామపక్షాల మద్దతు మరువలేనిది

నరసాపురం-కోటిపల్లి రైల్వేలైను పూర్తికి కృషి

ఆక్వా, వరి సాగు పరిరక్షణకు చర్యలు

కోకోనట్ ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజీలు, ఐటి హబ్‌లు ఏర్పాటు

కాంగ్రెస్ నరసాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు

ప్రజాశక్తి - భీమవరం

కాంగ్రెస్ పార్టీకి విధేయులు.. నాలుగు దశాబ్దాల నుంచి సేవలందిస్తూ ఎన్నో కీలక పదవులు చేపట్టి అటు ప్రజలకు, ఇటు రైతాంగానికి విస్తృత సేవలందించిన ఘనత కెబిఆర్.నాయుడు సొంతం. ప్రస్తుతం ఆయనే మన నరసాపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి. ఇండియా వేదిక మద్దతుతో బరిలో ఉన్న నాయుడు ఇప్పటికే తొలివిడత ప్రచారాన్ని ముగించుకుని మలివిడత ప్రచారం ముమ్మరం చేశారు. వామపక్షాలతో సమన్వయం చేసుకుని ముందుకెళ్తున్న కెబిఆర్.నాయుడు ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన అనేక విషయాలను పంచుకున్నారు. ఇండియా వేదికతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని చెప్పారు. బిజెపితో జత కలిసిన టిడిపి, జనసేన పరోక్షంగా కలిసి నడుస్తున్న వైసిపిలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నరసాపురం పార్లమెంటు నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దడంతోపాటు పశ్చిమగోదావరి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతానని చెప్పారు.

ప్రశ్న: మీ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

ఎంపీ అభ్యర్థి : తొలివిడత ఎన్నికల ప్రచారం పూర్తి చేసుకున్నాను. రెండోవిడత ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నాం. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఆచంట, ఉండి నియోజకవర్గాల్లోని పట్టణ, మండల కేంద్రాలు, గ్రామస్థాయిల్లో రోడ్‌షోలు నిర్వహిస్తూ ర్యాలీలు చేపడుతున్నాం.

ప్రశ్న: ప్రచారానికి ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

ఎంపీ అభ్యర్థి : పదేళ్ల బిజెపి పాలన, ఐదేళ్ల వైసిపి పాలనలో అన్ని తరగతుల ప్రజలకూ తీవ్ర అన్యాయం జరిగింది. దీంతో ప్రజలకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ కన్పిస్తోంది. ప్రచారంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలు కోరుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. బిజెపితో కూటమిగా ఏర్పడిన టిడిపి, జనసేనలను, బిజెపితో సత్సంబంధంతో ఉన్న వైసిపిలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. కచ్చితంగా కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసిస్తున్నారని నమ్ముతున్నాను.

ప్రశ్న : కాంగ్రెస్ మేనిఫెస్టో, గ్యారంటీలపై ప్రజాదరణ ఎలా ఉంది. ప్రజలు ఏమనుకుంటున్నారు?

ఎంపీ అభ్యర్థి: టిడిపి కూటమి, వైసిపి మేనిఫెస్టోలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. కాంగ్రెస్ నిర్దిష్టమైన ప్రణాళికతో మేనిఫెస్టోను రూపొందించింది. సంక్షేమం, అభివృద్ధితోపాటు యువత, మహిళలు, రైతులు, అన్ని తరగతుల ప్రజల భవిష్యత్తుకూ మేనిఫెస్టో అండగా నిలుస్తోంది. అనేక పథకాలు కాంగ్రెస్ గ్యారంటీల్లో రూపొందించారు. పని ముట్లపై జిఎస్‌టి రద్దు, ఉద్యోగులకు, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పన, సామాజిక అసమానతలు


మన్మోహన్‌సింగ్‌తో నాయుడు

తొలగించేందుకు కుల, జనగణన, ఎస్‌సి, ఎస్‌టి దామాషా ప్రకారం సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపు వంటి ప్రధాన అంశాలను మేనిఫెస్టోలో పొందుపర్చారు. ఈ మేనిఫెస్టోకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

ప్రశ్న : వామపక్షాలు సిపిఎం, సిపిఐ మద్దతు ఎలా ఉంది?

ఎంపీ అభ్యర్థి: ఇండియా వేదికలో వామపక్షాల మద్దతు చారిత్రాత్మకం. ముఖ్యంగా సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పని చేయడం అనేది మాటల్లో చెప్పలేనిది. నిజాయతీ, నిబద్ధతకు నిదర్శనం వామపక్షాలు. నాయకులు, కార్యకర్తలతోపాటు కార్మికులంతా నిజాయితీగా, ఏమీ ఆశించకుండా ఇండియా వేదిక అభ్యర్థుల తరపున పని చేయడం గొప్ప విషయం. నా ఎన్నికల ప్రచారంలో వామపక్షాలు, ప్రజాసంఘాలంతా కలిసికట్టుగా ముందుకు నడుస్తున్నాయి. ప్రజల మద్దతు కూడగట్టడంలో వామపక్షాలు చేస్తున్న కృషి ఎనలేనిది. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు నేతృత్వంలో వామపక్ష శ్రేణులు నా విజయానికి అందిస్తున్న సేవలు మరువలేనివి.

ప్రశ్న: ప్రధాన పార్టీలన్నీ డబ్బుతోనే ఎన్నికల్లో ముందుకెళుతున్నారనే ప్రచారం ఉంది. దీన్ని మీరు ఏ విధంగా ఎదుర్కొంటున్నారు?

ఎంపీ అభ్యర్థి: గత ఎన్నికల్లో ఈ పార్టీలన్నీ అమలు కాని అనేక హామీలిచ్చి అన్ని తరగతుల ప్రజలను మోసగించి నట్టేట ముంచాయి. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ మోసగించేందుకు కంకణం కట్టుకున్నారు. రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వంటి వాటితోపాటు అనేక ప్రధాన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా గాలికొదిలేశాయి. పదేళ్లపాటు బిజెపి ప్రభుత్వం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపించింది. ప్రశ్నించాల్సిన టిడిపి, జనసేన రాష్ట్ర సమస్యలపై మాట్లాడిన సందర్భాలు లేవు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిలో పడాలంటే ప్రత్యేక హోదా అవసరం. తద్వారా పరిశ్రమలు వస్తాయి. ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. కేంద్రంలో ఇండియా వేదిక అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై మొదటి సంతకం పెడతానని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. జనసేన, టిడిపి, వైసిపిల్లో ఏ పార్టీకి ఓటేసినా అది బిజెపికే వెళ్తుందని ప్రజలకు అర్థమైంది.

ప్రశ్న: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

ఎంపీ అభ్యర్థి: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక విజయదుందుభి మోగిస్తోంది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నాను. నరసాపురం ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకుంటుంది. నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తా. కొబ్బరి రైతులను ప్రోత్సహించడంతోపాటు కొబ్బరికి డిమాండ్ పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాను. కోకోనట్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పి కొబ్బరి రైతులను ఆదుకుంటాను. ఆక్వా రంగంలో సమస్యలను పరిష్కరించడంతోపాటు వ్యవసాయ రంగాన్ని పరిరక్షించే బాధ్యత తీసుకుంటాను. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడంతోపాటు వారి అభివృద్ధికి అండగా నిలుస్తాను. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు వంటి పట్టణ ప్రాంతాల్లో ఐటి హబ్‌లు నెలకొల్పుతాం. గోదావరి, సముద్రతీర ప్రాంతాన్ని పర్యాటకంగా



అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతాను. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నరసాపురం - కోటిపల్లి రైల్వే లైన్ నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటాను. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతాను. రైతులు, ప్రభుత్వ భాగస్వామ్యంతో కోల్డ్‌స్టోరేజీలు, డెయిరీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాను. పట్టణాభివృద్ధి శాఖ ద్వారా భీమవరం వంటి మున్సిపల్ కేంద్రాలకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాను. సన్న, చిన్నకారు రైతులు, ఆకు, కాయగూరలు, పండ్లు, ఉద్యానవనం, తమలపాకు వంటి రైతులు, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను.

ప్రశ్న : జిల్లాతో మీకున్న అనుబంధం ఏమిటీ?

ఎంపీ అభ్యర్థి: మాది కోనసీమ జిల్లా అమలాపురం. పశ్చిమగోదావరి జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. బంధుత్వాలు కూడా ఎక్కువే. మా నానమ్మ వీరవాసరం మద్దాల వారి ఆడపడుచు. కాపు సామాజిక తరగతితో సత్సంబంధాలు ఉన్నాయి. ఒక్క పశ్చిమగోదావరి జిల్లానే కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని కాపుల సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశాను.. చేస్తాను. ఇప్పటికే కాపులకు ఏమైనా సమస్యలు ఏర్పడితే మొదటిగా నన్నే సంప్రదిస్తారు.

ప్రశ్న : ప్రజల నుంచి మీరేమి కోరుకుంటున్నారు?

ఎంపీ అభ్యర్థి: ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించేవి. ఓటు హక్కు వజ్రాయుధం. ఎటువంటి ప్రలోభాలకూ లొంగకుండా నీతి నిజాయితీతో ఉన్న నాయకులను ఎన్నుకోవాలి. రాజకీయాల్లో అనుభవం ఎంతో ముఖ్యం. కొత్తవారు రాజకీయాల్లోకి రావడం కూడా ఎంతో ముఖ్యం. అయితే సమర్థవంతమైన నాయకుడినే ఎన్నుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉంటుంది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాకు, ఇండియా వేదిక అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నాను.

ప్రజాస్వామ్య పరిరక్షణకు 'ఇండియా'నే దిక్సూచి

నియంతృత్వ పాలన సాగిస్తున్న బిజెపిని తరిమికొట్టాలి

పొత్తులో ఉన్న టిడిపి, జనసేన, అనుకూలంగా ఉన్న వైసిపిని ఓడించాలి


ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలి

ప్రజా సమస్యలపై సిపిఎం నిరంతర పోరాటం

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, దీన్ని పరిరక్షించుకోవాలంటే ఇండియా వేదిక ఒక్కటే దిక్సూచి అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి ముస్లిం మైనార్టీలపై దాడులు చేస్తూ నియంతృత్వ పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బిజెపితో పొత్తులో ఉన్న టిడిపి, జనసేన అనుకూలంగా ఉన్న వైసిపిలను సైతం



ఓడించాలన్నారు. ప్రజా సమస్యలు, రైతులు, మహిళలు, యువత సమస్యలు పరిష్కారం కావాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న సిపిఎం ఆ విధంగా అడుగులు వేస్తోందని, ప్రజానీకమంతా ఏకమై ఆలోచించి ఓటువేసి సమర్థవంతమైన నాయకుడిని, సమన్వయంతో పాలించే ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం ప్రజాశక్తితో మంగళవారం మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ ఇండియా కూటమిలో ప్రధాన పక్షమైన కాంగ్రెస్‌తో సీట్లు సర్దుబాటు చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో నర్సాపురం పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా కెబిఆర్ నాయుడు, భీమవరం అసెంబ్లీ అభ్యర్థిగా అంకెం సీతారాం ఉండిలో వేగేశ్న గోపాలకృష్ణంరాజు, పాలకొల్లులో కొలుకులూరి అర్జునరావు, ఆచంటలో నెక్కంటి సత్యనారాయణ (సతీష్) తణుకులో కడలి రామారావు, తాడేపల్లిగూడెంలో మార్నీడి శేఖర్ (బాబ్జి), నరసాపురంలో కానూరి బుజ్జి పోటీ చేస్తున్నారని, అమూల్యమైన ఓటు వేసి వారందరినీ గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బిజెపి నియంతృత్వ పాలన సాగిస్తోందని విమర్శించారు. ధరలు తగ్గిస్తానని చెప్పి పెనుభారాన్ని మోపిందన్నారు. విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికితెస్తానన్నది తేకపోగా ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్లు లూటీ చేసిందని విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి తీవ్రంగా మోసం చేసిందన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీసిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పక్కకునెట్టి కాలయాపన చేసిందన్నారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై దాడులు చేస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. బిజెపి ఇస్తామన్న ప్రత్యేక హోదా ఇవ్వలేదని, రైల్వేజోన్ లేదని , పోలవరం ప్రాజెక్టుకు నిధుల్లేవని, కడపలో స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తామని చెప్పి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్రానికి బిజెపి ఎంత అన్యాయం చేసినా వైసిపి, ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రశ్నించకపోవడం అత్యంత దారుణమన్నారు. చివరకు బిజెపితోనే టిడిపి, జనసేన పొత్తు పెట్టుకోవడం అత్యంత దారుణమన్నారు. అధికార పార్టీ వైసిపి కూడా బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తూ బిజెపి చేస్తున్న చట్టాలను ఇక్కడ అమలు చేస్తూ పబ్బం గడుపుకుంటోందన్నారు. బిజెపికి లొంగిపోయి తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపితోపాటు టిడిపి, జనసేనను ఓడించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కాలుష్యం విపరీతంగా పెరిగిందన్నారు. ఆక్వా, వరి రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. కొబ్బరి పరిశ్రమ సంక్షోభంలో పడిందన్నారు. జిల్లాలో ప్రజా సమస్యలపై నికరంగా పోరాడేది సిపిఎం మాత్రమేనని చెప్పారు. ఇండియా వేదిక ద్వారా వామపక్షాలు బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఇండియా వేదికతోనే అభివృద్ధి

కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు

ప్రజాశక్తి - గణపవరం

ఇండియా వేదికతోనే అభివృద్ధి సాధ్యమని ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు మంగళవారం ముగ్గళ్లలో హరికుమార్‌రాజు, సిపిఎం కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి హరికుమార్ రాజు, సిపిఎం కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని, బిజెపి చెబుతున్న బూటకపు మాటలు వినకుండా ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జె.చంద్రశేఖర్, సిపిఎం నాయకులు ఎం.పెంటారావ్, ఇండియా వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న హరికుమార్‌రాజు

పలు గ్రామాల్లో రోషన్‌కుమార్ ప్రచారం


ప్రచారం చేస్తున్న రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో గురించి ప్రజలకు తెలియజేస్తూ, తన ప్రచారాన్ని పలు గ్రామాల్లో నిర్వహించారు. తాడువాయి పంచాయతీ చల్లావారిగూడెంలో సుమారు 200 కుటుంబాలు రోషన్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి వైపు నడిపిస్తానని తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలోఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పతి కోసం సతి ప్రచారం

పాలకొల్లు గుడాల గోపి సతీమణి ప్రచారం

పాలకొల్లు: పట్టణంలోని 7వ వార్డులో వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సతీమణి గుడాల మంగతాయారు మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంగతాయారు మాట్లాడుతూ సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి సిఎంగా జగన్ ఉంటేనే కొనసాగుతాయన్నారు. గుడాల గోపీని అత్యధిక మెజార్టీతో గెలుపించుకుని తద్వారా జగన్‌ను సిఎం చేయాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో గోపి కుటుంబ సభ్యులు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణాధ్యక్షులు చందక సత్తిబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దా చంద్రకళ, పెద్దగోపురం ఛైర్మన్ కోరాడ శ్రీను పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న గుడాల మంగతాయారు



మాట్లాడుతున్న బలరాం

పదేళ్ల బిజెపి పాలనలో ప్రజానీకం అధోగతి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

బిజెపి పదేళ్ల పాలనలో ప్రజానీకం అధోగతి పాలైందని, ఎన్నికల్లో తగు గుణపాఠం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు పాలకోడేరులో ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్వి గోపాలన్ పాల్గొన్నారు. విస్సాకోడేరులో ప్రారంభమైన ఎన్నికల ప్రచారం గొరగనమూడి, పెన్నాడ, శృంగవృక్షం, కొండేపూడి, వేంద్ర, వేంద్ర అగ్రహారం, మోగల్లు, పాలకోడేరు, కోరుకొల్లు, కుముదవల్లి, గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ బిజెపి నిరంకుశత్వ పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపిని గద్దె దింపాలన్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి పెట్రేగిపోతోందన్నారు. ప్రజలపై అనేక భారాల మోపి నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన పార్టీలతోపాటు అనుకూలంగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలన్నారు. ఎంఎల్ఎ అభ్యర్థి వెంకట గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాపాలన రాబోతోంది

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

త్వరలోనే ప్రజాపాలన రాబోతోందని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రాతళ్లమెరక గ్రామంలో రఘురామకృష్ణంరాజు ఎన్నికల ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఐదేళ్ల విధ్వంసకర జగన్ పాలనకు స్వస్తి పలికేందుకు ఈ నెల 13న జరగబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. గ్రామ సర్పంచి కంతేటి ఉష, శ్రీనివాసరాజు, వేగిరాజు శివ వర్మ, కంతేటి సుబ్బారాజు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే విధ్వంసం మొదలైందన్నారు. ఈ ప్రచారంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకటనాగేశ్వరరావు పాల్గొన్నారు.




ప్రచారం చేస్తున్న రఘురామకృష్ణంరాజు

మరోసారి మోసగించడానికే కూటమి మేనిఫెస్టో

రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్

ప్రజాశక్తి - వీరవాసరం



మాట్లాడుతున్న సుభాష్‌చంద్రబోస్

మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టోతో వస్తున్న కూటమికి ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. జయహో బిసి సభ సోమవారం రాత్రి డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅథితిగా వచ్చిన సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ మోసపూరితంగా అధికారంలోకి రావాలన్నదే చంద్రబాబు ఎత్తుగడ అన్నారు. వాస్తవానికి దగ్గరగా ఉన్న వైసిపి మేనిఫెస్టో అంశాలు తూచా తప్పకుండా అమలు చేసే జగన్మోహన్‌రెడ్డికి మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. దేశంలో బిసిలు సిఎంగా అధికారంలో ఉన్నా అమలు చేయలేని పథకాలను మన రాష్ట్రంలో బిసిలు, ఎస్సి, ఎస్టి, మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఓటు అమ్ముకునే సాంప్రదాయాన్ని వదిలి, వైసిపి భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌ను, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ తనను ఆదరించి గెలిపించాలని కోరారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ బిసిలకు ఎవరు మేలు చేశారో ఆలోచించుకుని ఓటు వేయాలన్నారు. వైసిపి అధికారంలోకి రాకపోతే నష్టపోయేది బిసిలే అన్నారు. మరో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలకు ఎంతో మేలు చేసిన జగన్మోహన్‌రెడ్డికి అంతా మరోసారి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ, టిటిడి పాలకవర్గ సభ్యుడు మేకా శేషబాబు, గుబ్బల తమ్మయ్య, పెండ్ర వీరన్న, జెడ్‌పిటిసి కాండ్రేకుల నరసింహారావు, సత్యనారాయణ, ధర్మారావు పాల్గొన్నారు.

రైతుల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - ఉండి

రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ పొలం పనులకు వెళ్లకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మహదేవపట్నం గ్రామానికి చెందిన రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మహదేవపట్నం గ్రామ వంతెన నుంచి భీమవరం మెయిన్ రోడ్డు వరకూ 99 సంవత్సరాలు లీజుకు తీసుకున్నామని, కొన్ని సంవత్సరాల నుంచి రైతులను ఇబ్బంది పెడుతున్నారని వారి ఆగడాలు ఇటీవల మితిమీరిపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు స్పందించలేదని రైతులు వాపోతున్నారు. దీనికి సంబంధించి మహదేవపట్నం గ్రామ రైతు తక్కెళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ కొందరు కొబ్బరి చెట్ల లీజు పేరుతో తమ పొలాలకు వెళ్లకుండా ఇబ్బందులు పెట్టేవారని, ఇటీవల రోడ్డు వెంబడి చెట్టుకూ చెట్టుకు మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో కొబ్బరి మొక్కలు నాటడంతో పొలంలోకి వెళ్లడానికి, పంట రోడ్డు మీదకు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని, లీజు రైతుతో మాట్లాడితే రైతులను బెదిరించడమే కాకుండా కొబ్బరి మొక్కపోతే రూ.10 వేల జరిమానా కట్టాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన రైతులందరూ నెల రోజుల క్రితం జెఇ ఫణిశంకర్, 15 రోజుల క్రితం డిఇ సత్య నారాయణమూర్తికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కాసులకు కక్కుర్తిపడి రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ప్రజాసంఘాల నేతలు విమర్శి స్తున్నారు. లీజుదారులు అగ్రిమెంటులో ఉన్న కొబ్బరి చెట్ల పంటను పొందాలే తప్ప కొత్తగా కొబ్బరి మొక్కలు నాటితే అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం ఏంటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన రైతుల సమస్యను పరిష్కరించి వారిని వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాడతామని అధికారులను ప్రజాసంఘాల నేతలు హెచ్చరించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కామవరపుకోట



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రైతుల భూయాజమాన్య హక్కులు హరించేలా రూపొందించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ మాట్లాడుతూ ఈ చట్టంలో భూయాజమాన్య హక్కుల వివాదాల పరిష్కారంలో సివిల్ కోర్టుల పాత్రను పూర్తిగా తొలగించడం, రిజిస్ట్రేషన్ సంబంధించిన ఒరిజినల్ పత్రాలు యజమానులకు అందించకపోవడం, హైకోర్టులోనే అంతిమ పరిష్కారమనడం రైతులకు న్యాయం అందనంత దూరమవుతుందన్నారు. కోర్టుకు వెళ్లాలన్నా సంబంధిత అథారిటీ అనుమతి తీసుకోవాలన్న నియమం దారుణమన్నారు. తక్షణం ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మద్దిపోటి నాగేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి ఘంటా సుధీర్‌బాబు, డోలా విజయ్, బొబ్బిలి డాన్‌దివాకర్, ఘంటా గోపీ, కటికర్ల నాని, నెక్కలపూడి మల్లికార్జునరావు, కరుటూరి భూషణం, కొప్పిశెట్టి చిన్న, పెనుమాల కిరణ్, కస్సే ప్రకాశం, అల్లూరి కృష్ణప్రసాద్, సాయన శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు దారుణం

ప్రజాశక్తి - ఆచంట

చంద్రబాబు ఎన్‌డిఎ కూటమిలో కలిసిన తర్వాత ఎలక్షన్ కమిషన్ లేనిపోని నిబంధనలు పెట్టడం దారుణమని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం తూర్పు పాలెం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ చంద్రబాబు నాయుడుకు ఒక తొత్తులా తయారైందన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి పిల్లలకు రావాల్సిన విద్యాదీవెన సుమారు రూ.610 కోట్లు గడిచిన ఐదేళ్లుగా ఇవ్వడం జరిగిందన్నారు. అటువంటి పథకాలను అడ్డుకోవడం చాలా దురదృష్టకరమన్నారు. అలాగే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.847 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉందని, వాటిని కూడా రైతులకు చేరకుండా అడ్డుపడడం హేయమైన చర్య అని అన్నారు. మరో 20 రోజుల్లో రైతులు ఆకుమడులు వేసుకునే సమయమని, రైతులకు అందాల్సిన విత్తనాలను రైతులకు చేరకుండా అడ్డుకోవడం దారుణమని తెలిపారు. ఎంతోమంది పేద విద్యార్థులు విద్యాదీవెన కోసం ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు కనుసైగల్లో వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్ ఇటువంటి దుర్మార్గపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణం ఎన్నికల కమిషన్ పునరాలోచించుకుని విద్యార్థులకు, రైతులకు న్యాయం చేసే విధంగా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

పెనుగొండ: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. మంగళవారం బజార్ రోడ్డు మీదుగా చెరుకువాడ, కంబాలవారివీధి, వేంద్రవీధిలో ఆయన ప్రచారం నిర్వహించారు. మరోసారి వైసిపి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కోడూరు గోవర్ధన్ జవ్వాది లక్ష్మీనారాయణ (నానాజీ) వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడ్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు పాటించాల్సిన కోడ్ నిబంధనలపై ఎస్‌పి మేరీ ప్రశాంతి అవగాహన కల్పించారు. ఆమె మంగళవారం లింగపాలెం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ధర్మాజీగూడెం ఎంపీపీ స్కూల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను పరిశీలన చేసి అక్కడ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్లో అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో నూజివీడు సెబ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాయ్.. రాజా కాయ్..!

(మొదటి పేజీ నుంచి)

చెబితే అతను వేరొకరిని పందేనికి ఏర్పాటు చేస్తున్న పరిస్థితులు సాగుతున్నాయి. ఈ పందేల విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎవరికి ఆనందం.. ఎవరికి బాధో జూన్ నాలుగో తేదీన తెలియనుంది.

కొనసాగిన పోస్టల్ ఓటింగ్

(మొదటి పేజీ నుంచి)

మంది మొత్తం జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 12,773 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ప్రకటించారు. బుధవారం నుంచి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద పోస్టల్ బ్యాలెట్ కొనసాగనుందని, ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ పొందని వారికి మరో అవకాశం

పశ్చిమ ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

కొన్ని అనివార్య కారణాలవల్ల పోస్టల్ బ్యాలెట్‌ను పొందని ఉద్యోగులకు ఎన్నికల కమిషన్ మరో అవకాశాన్ని కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది 8వ తేదీన కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కేటాయించిన షెడ్యూలు ప్రకారం ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 దరఖాస్తును అనివార్య కారణాల వల్ల సమర్పించలేని వారు, అలాగే ఫారం-12 సబ్మిట్ చేసి ఏదైనా కారణం చేత పోస్టల్ బ్యాలెట్‌ను పొందని వారు తమకు ఓటు హక్కు కలిగిన నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారుల వద్ద ఫారం-12 సబ్మిట్ చేసి 8వ తేదీన సబంధిత నియోజకవర్గ ఆర్ఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల్లోపు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు

(మొదటి పేజీ నుంచి)

ఓటరు హెల్ప్‌డెస్కలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ డి.పుష్పమణి, కలెక్టరేట్ ఎఓ కె.కాశీవిశ్వేశ్వరరావు, కలెక్టరేట్ వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనులపై కేసు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

మండలంలో కొందరి ఇంటి గోడలపై జగన్ సిద్ధం స్టిక్కర్స్ అంటించి, ఎన్నిక కోడ్ ఉల్లంఘించారని గ్రామీణ ఎస్ఐ సురేష్ మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బండారు నాగు సివిజిఎల్ యాప్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లైయింగ్ స్వాడ్ బివిఎస్‌బి.రాజు గ్రామంలో తనిఖీ చేశారు. కుంచినపల్లి గ్రామంలో కూడా అదే మాదిరిగా కొందరి ఇంటి గోడలపై జగన్ సిద్ధం స్టిక్కర్స్ అంటించి ఉన్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి గుర్తించారు. ఇది వైసిపి సానుభూతి పరులు అంటించినట్లు సమాచారం అన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

సర్పంచి హేమకుమారి అభినందనీయురాలు

ప్రజాశక్తి - తణుకురూరల్

అమెరికా ఐక్యరాజ్యసమితి సదస్సులో మహిళా సాధికారత కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాణి వినిపించి అందరి మన్ననలు పొందిన ఇరగవరం మండలం పేకేరు సర్పంచి కునుకు హేమకుమారి అభినందనీయురాలని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో సర్పంచి హేమకుమారిని మంత్రి కారుమూరి, ఎంఎల్‌సి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మెన్ చిట్టూరి సుబ్బారావు పాల్గొన్నారు.

'బిసిలకు అండగా టిడిపి'

ఆకివీడు: టిడిపి బిసిల పార్టీ అని తమ పార్టీ ఆవిర్భావం నుంచి బిసిలకు అండగా నిలిచిందని పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉండి నియోజకవర్గ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో టిడిపి బిసి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పార్టీ మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్ అధ్యక్షత వహించగా రామరాజు మాట్లాడుతూ టిడిపి బిసిలకు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందని, బిసిల అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారించిందని వివరించారు.

టిడిపిలోకి పలువురు: ఎన్నికలు మరో ఐదు రోజులు మాత్రమే ఉన్నా.. ప్రస్తుత తరుణంలో ఆ పార్టీకి పెద్ద దెబ్బ తగిలింది. స్థానిక మండలకేంద్రం ఆకివీడు పట్టణంలో ఒక సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వైసిపి నాయకుడిగా ఉన్న శిరపు శీను ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. ఆయనతో పాటు పార్టీలోని కొత్తపల్లి సత్యనారాయణ, కాకర్ల ఫణి, శ్రీనివాస్, మరింతమంది యువ నాయకులు పార్టీ మారారు. బిసి సదస్సు సందర్భంగా బిసిల్లో ఎక్కువమంది ఉన్నవారికి నాయకత్వం వహిస్తున్న యువ నాయకులు అధికార పార్టీని వీడి టిడిపిలో చేరడం పలువురును ఆశ్చర్యం కలిగించింది.

'డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనతోనే అభివృద్ధి'

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ పాలన వస్తేనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉద్యమ నేత, కాపు జెఎసి రాష్ట్ర కన్వీనర్ ఆకుల రామకృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో కాపు జెఎసి ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. రాబోయేది కూటమి ప్రభుత్వమేనని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా, నరేంద్ర మోడీ ప్రధానిగా డబుల్ ఇంజన్ సర్కారుతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందిస్తారన్నారు. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు రాష్ట్ర నాయకులు ఆరేటి ప్రకాష్, ఎర్రంశెట్టి సాయిబాబు పాల్గొన్నారు.

మన్యం విప్లవ వీరుడు అల్లూరి వర్ధంతి

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురం:అల్లూరికి నివాళులర్పిస్తున్న నేతలు

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక మీరా స్మారక గ్రంథాలయం, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విజ్ఞాన కేంద్రం నిర్వాహక కమిటీ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, మన్యం విప్లవాన్ని చేపట్టిన అల్లూరి మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ నాయకురాలు పొగాకు పూర్ణ, గ్రంథాలయ నిర్వహక కమిటీ సభ్యులు నోముల కొండ, పొగాకు నారాయణరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ లైన్ పేరిచెర్ల మురళీకృష్ణంరాజు, పాతూరు యూత్ సభ్యులు దాట్ల జగన్నాథరాజు, క్షత్రియ సేవా సమాఖ్య సభ్యులు స్థానిక ఆర్‌టిసి బస్ డిపో వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి క్షత్రియ సేవా సమాఖ్య అధ్యక్షులు లయన్ ఎఆర్ కె.వర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో చిన్న వయసులోనే అశువులు బాసిన విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరిని జాతి మరువదని, ప్రభుత్వం భారత రత్న అవార్డు ఇచ్చి భావితరాలకు అల్లూరి చరిత్ర అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సామన సత్యనారాయణ, కోప్పేళ్ళ సాయి సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



ఆచంట: నివాళులర్పిస్తున్న నాయకులు

తణుకురూరల్: అల్లూరి శత వర్ధంతిని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తణుకు బార్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్యం వీరుడు చిత్ర పటానికి తణుకు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొండా శ్రీనివాస్ పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామన మునిస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కౌరు వెంకటేశ్వర్లు, ధనాల అప్పారావు పాల్గొన్నారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై రగిలిన మన్యం విప్లవ నిప్పు రవ్వ అల్లూరి సీతారామరాజు అని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి ప్రతాప్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎంటి అమరవీరుల స్థూపం వద్ద సిపిఎం ఘనంగా నివాళ్ళు లర్పించింది. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గార రంగారావు, సత్యనారాయణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆచంట: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఆదివాసి కుటుంబాలే ఉపాధి కోల్పోతున్నాయని సిపిఎం సీనియర్ నాయకులు ఇందుకూరు సూర్యనారాయణ రాజు అన్నారు. మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి వేడుకలు మంగళవారం వల్లూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమావేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆశయ సాధన కోసం యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోగి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు, సుబ్బారావు, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

దాతృత్వంలో అద్దేపల్లి చిరస్మరణీయులు : ఎంఎల్‌ఎ నిమ్మల

పాలకొల్లు: దాతృత్వంలో అద్దేపల్లి సత్యనారాయణమూర్తి చిరస్మరణీయులని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. అద్దేపల్లి వారి సత్రం ప్రాంగణంలో సోమవారం రాత్రి ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంవత్సరం పాటు ప్రతినెల జరిగే అద్దేపల్లి జయంతి ఉత్సవ వేడుకల సభలో ఆయన మాట్లాడారు. ముందుగా అద్దేపల్లి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సేవా కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పాలకొల్లులో ఆనాడు ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు రైస్ మిల్లును సైతం అమ్మి అవసరమైన స్థలం సమకూర్చిన విద్యా దాతగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వర్గానికి చెందిన దాతల కుటుంబీకులైన కంచర్ల కనకం, అద్దేపల్లి బాలగంగాధర్, శ్రీఖాకొలపు కామేశ్వరరావు, మైథిలీ దంపతులను ఎంఎల్‌ఎ సత్కరించారు. సభలో మద్దుల కిరణ్ గుప్తా, జీవి, పెచ్చేటి బాబు, దీప్తి అప్పారావు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా కలిసి పయనించాలి

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కుల మత, రాజకీయాలకు అతీతంగా మన భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి మనమందరం కలిసి ప్రయాణించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కాపు కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన తూర్పు కాపుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన విషయం తెలిసిందేనని అన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు రెట్టింపు అవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గనిరెడ్డి త్రినాథ్, జగ్గురోతు విజయ్ పాల్గొన్నారు.

భూ యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలి

చింతలపూడి: ఎపి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టంతో రాష్ట్ర రైతాంగం మొత్తం తీవ్ర భయాందోళనలకు లోనైందని, దీన్ని ఉపసంహరించుకోవాలని రైతుల పక్షాన రైతుసంఘం జిల్లా అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు కోరారు. ఈమేరకు మంగళవారం చింతలపూడిలోని తహశీల్దార్ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు మాటూరి వెంకట్రామయ్య, పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అధ్యక్షతన రైతు నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిదండ్రులకు వారసత్వంగా సంక్రమించిన స్వార్జితమైన భూములు, భవనాలపై ప్రస్తుత యాజమాన్య హక్కులు అతి సులువుగా అన్యాక్రాంతం అవుతాయన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, వెంకటాద్రి గూడెం గ్రామ అధ్యక్షులు చింత విష్ణు పాల్గొన్నారు.

పోడూరు: జగన్ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ కరువైందని, దీనిని రద్దు చేయాలని కోరుతూ తహశీల్దార్లకు రైతులు వినతి పత్రాలు అందజేశారు. మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం రైతులు పెద్ద సంఖ్యలో చేరి చట్టంపై నిరసన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో రైతు నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మేడిశెట్టి బుజ్జి, ముచ్చర్ల శ్రీనివాస్, పాటబళ్ళ బాలాజీ పాల్గొన్నారు.

ప్రాణత్యాగాల స్వాతంత్రానికి తూట్లు

సిపిఎం పశ్చిమ జిల్లా కార్యదర్శి బి.బలరాం
భీమవరంలో ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి



నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఎంతోమంది ప్రాణత్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్రాన్ని నేటి పాలకులు నీరుగారుస్తున్నారని సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. బలరాం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పేరు వింటేనే ఆంధ్రుల హృదయాలు పులకిస్తాయన్నారు. మన్య విప్లవ పోరాటం, సాయుధ తిరుగుబాటు, వీరోచిత ప్రజా ప్రతిఘటన కీలక ఘట్టాలని అన్నారు. అల్లూరి వంటి ఎంతోమంది ప్రాణత్యాగాల ఫలితంగా వచ్చిన స్వాతంత్రాన్ని మన పాలకులు నీరుగారుస్తున్నారన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం దేశ ఫెడరలిజాన్ని, లౌకికతత్వాన్ని, సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేవిధంగా పాలన సాగిస్తోందన్నారు. సామాజిక భద్రత కొరవడిందన్నారు. మైనార్టీలు, దళితులపై దాడులు సాగిస్తోందన్నారు. వారికి కేటాయించాల్సిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను, విద్య, వైద్యం కోసం కేటాయించాల్సిన నిధులను కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మతాలు, కులాల మధ్య ఐక్యతను దెబ్బతీస్తోందన్నారు. ఈ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత ప్రజందరిపై ఉందన్నారు. ప్రతి పౌరుడూ తన ఓటుహక్కు ద్వారా తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, పట్టణ కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



నినదిస్తున్న రైతులు

గోనె సంచులివ్వాలని ఆర్‌బికె వద్ద ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

తక్షణమే తమకు గోనె సంచులిచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని కౌలురైతులు మల్లవరం రైతుభరోసా కేంద్రం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం మండల కార్యదర్శి కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకపక్క వాతావరణం మారి రైతులు ధాన్యం మాసూళ్లు చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం పట్టేందుకు సంచుల కోసం రైతుభరోసా కేంద్రాలకు వెళ్తుంటే నాలుగు రోజులు గడిచినా సంచులు ఇవ్వడం లేదని తెలిపారు. మల్లవరం గ్రామానికి సుమారు 50 వేల సంచులు ఇచ్చామని, 25 వేల సంచులు ధాన్యం పట్టామని, మిగిలిన సంచులు రైతుల వద్దే ఉన్నాయని అధికారులు చెబుతున్నారని తెలిపారు. అయితే కౌలురైతులు ధాన్యం పట్టాలంటే సంచులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సంచులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మల్లవరం, మల్లవరం లంక కౌలురైతులు పాల్గొన్నారు.

జోరు వర్షంలో సిపిఐ అభ్యర్థి బండి ప్రచారం



గొడుగులతో సిపిఐ అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో మంగళవారం సాయంత్రం ఇండియా వేదిక బలపరిచిన సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారం జోరు వర్షంలో సాగింది. కంకి కొడవలి గుర్తులున్న గొడుగులు చేతపట్టి స్థానిక 36, 39వ డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించడం ద్వారా భారతదేశ లౌకిక వ్యవస్థను కాపాడటం, మత సామరస్యాన్ని పెంపొందించడం, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించడం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంతోపాటు ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలకు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, నాయకులు బి.జగన్నాధరావు, సామంతుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో 13,103 పోస్టల్ ఓటింగ్ నమోదు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో మంగళవారం రాత్రికి 13,103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. వీటిలో ఏలూరు జిల్లాకు సంబంధించి 6,983 ఓట్లు పోలవ్వగా, ఇతర జిల్లాలకు సంబంధించి 2171 ఓట్లు పోలయ్యాయి. అత్యవసర సర్వీసుల సిబ్బందికి సంబంధించి 1831 ఓట్లు నమోదయ్యాయి. మైక్రో అబ్జర్వర్స్‌కు సంబంధించి 258 ఓట్లు పోలవ్వగా ఇతరులకు సంబంధించి 1860 ఓట్లు పోలయ్యాయి.

వర్ష బీభత్సం..!

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెండు నెలలుగా తీవ్రమైన వేడి, ఉక్కపోత, వడగాల్పులతో సతమతమవుతున్న ప్రజలకు ఒక్కసారిగా ఉపశమనం లభించింది. తూర్పు విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకూ విస్తరించిన ద్రోణి ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఏలూరు నగరంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, చల్లనిగాలులతోపాటు వర్షం కురవడంతో నగర ప్రజలు సేదతీరారు. సుమారు రెండు గంటలపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడి నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఎండ మాయమై ఆకాశం కారుమబ్బులతో నిండిపోయింది. అనంతరం చల్లని గాలులు వీచి వర్షం మొదలవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. అయితే రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులకు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఎండ వేడికి కిటకిటలాడిన జ్యూస్, ఐస్‌క్రీమ్ షాపులు, చెరుకు రసం దుకాణాలు ఒక్కసారిగా వెలవెలబోయాయి. సాయంత్రం వరకు చిన్నగా వర్షం పడుతూ ఉండటంతో బజ్జీల బండ్లు, వేడి కళాయి బండ్లు కిటకిటలాడాయి. మొత్తంగా అకాల వర్షంతో నగర ప్రజలు సేదతీరారని చెప్పొచ్చు.

జీలుగుమిల్లి: మంగళవారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై మండలవ్యాప్తంగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల చేతికొచ్చిన వేరుశనగ, పొగాకు, మొక్కజొన్న తోటలు తడిసిపోయాయి. కొన్నిచోట్ల ఈదురుగాలులకు మామిడికాయలు నేలమట్టమయ్యాయి. చెట్ల కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పాలకొల్లు: పాలకొల్లులో రెండు రోజులుగా మబ్బు, ఎండ దోబూచులాడగా మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం పూర్తిగా మారి వర్షపు జల్లులు పడ్డాయి. ఆకాశం మేఘావృతమై వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రజలు సేదదీరారు. పక్షం రోజులుగా తీవ్రమైన ఎండ, ఉక్కపోత ప్రభావంతో సతమతమవుతున్న ప్రజలు మారిన వాతావరణంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడి: మండలంలో మంగళవారం అకాల వర్షం కురిసింది. అకాల వర్షం కురవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మామిడితోటలు కాపునకు సిద్ధంగా ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నరసింగపురం గ్రామంలో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న, కల్లాల్లో ఎండ బెట్టిన ఎండుమిర్చి తడిసిపోయిందని రైతులు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు.

కలిదిండి : కొన్ని రోజులుగా ఎండ వేడిమికి తాళలేక అల్లాడుతున్న జనానికి మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో సేదదీరినట్లయ్యింది. పల్లపు ప్రాంతాలలో వర్షం నీరు చేరింది. డ్రెయినేజీ సౌకర్యంలేని పలు రహదారులపై కొద్దిపాటి వర్షపు నీరు చేరింది.

పెనుమంట్ర: వాతావరణం మారి భారీ ఈదురు గాలులు వీయడంతో మండలంలోని రైతులు ఇబ్బంది పడ్డారు. 90 శాతం దాళ్వా మాసూళ్లు పూర్తయ్యాయి. వరి పంటపై టార్పాలిన్లుతో కప్పి రక్షించుకునే ప్రయత్నం చేశారు. మార్టేరు-పెనుగొండ రోడ్లో చెట్టు కూలి సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆచంట: ఆచంట పరిసర గ్రామాల్లో ఈదురుగాలి బీభత్సం సృష్టించింది. మంగళవారం మధ్యాహ్నం సుమారు గంట పాటు ఒక మోస్తరు వర్షం కురిసింది. ఆచంట, కొడమంచిలి, వల్లూరు గ్రామాల్లో పలు కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. వివిధ గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాళ్వా సాగు ఆలస్యం కావడంతో ఇంకా మాసూళ్లు పూర్తి కాలేదు.

ముదినేపల్లి: ముదినేపల్లి పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భీకర గాలులతో వాన కురిసింది. ఉరుములు, మెరుపులు తోడు కావడంతో చిన్నారులు, మహిళలు భయభ్రాంతులకు గురయ్యారు. గాలులకు పలు గ్రామాల్లో హోర్డింగులు, ఫ్లెక్సీలు నేలనంటాయి. చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొయ్యలగూడెం: గవరవరంలో రహదారి పక్కనేవ ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పూరి గుడిసెలపై పడింది. దీంతో కరెంటు తీగలు తెగిపోయాయి.

ఉంగుటూరు: ఈదురు గాలులు, భారీ వర్షాలకు అరటి తోటలు దెబ్బతిన్నాయి. ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో మలకలపల్లి శివ నాగ ప్రసాదుకు చెందిన 2.5 ఎకరాల్లో అరటి తోటలో పలు చెట్లు ఈదురుగాలులకు విరిగిపోయాయి. అదే గ్రామంలో మరో రైతు చెందిన 2.5 ఎకరాల్లో అరటి పంట దెబ్బతింది. వర్షానికి ధాన్యం తడవకుండా రైతులు బరకాలు కప్పారు.

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో ఈదురుగాలులు గంటసేపు బీభత్సం సృష్టించాయి. పలు కాలనీల్లో షెడ్లపై రేకులు లేచిపోయాయి. సాయంత్రం వర్షం జోరందుకుంది. కొన్నిచోట్ల చెట్లు నేలకొరిగాయి.

భీమడోలు: మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం, ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కళ్లాల్లో రవాణాకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా చేసే కండక్టర్లు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు నేలవాలడం జరిగాయని ట్రాన్స్‌కో భీమడోలు సహాయ డివిజనల్ ఇంజినీర్ గోపాలకృష్ణ తెలిపారు. గుండుగొలను ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు పడటంతో కొన్ని ఇళ్లు దెబ్బతిన్నాయని రెవెన్యూ అధికారులు తెలిపారు.

కైకలూరు: ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై బలమైన ఈదురు గాలులు వీచాయి. తేలికపాటి వర్షం పడింది. దీంతో ఆక్వారైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. చెరువుల్లోని ఆక్సిజన్ లెవెల్స్ పడిపోతాయని కంగారుపడ్డారు. కొందరు రైతులు ప్రత్యేక మందులను సిద్ధం చేసుకుని చేపల, రొయ్యల చెరువుల గట్లపై ఉన్నారు.

ఆకివీడు: నడి వేసవిలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు, వరిచేలు జలమయమయ్యాయి. రోడ్లపై ఎక్కడికక్కడ నీళ్లు నిలిచిపోయాయి.

ఉండి: అకాల వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం ఒబ్బిడి చేసుకొని బరకాలు కప్పుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు.

పిడుగుపాటుకు గురై

చింతలపూడి: పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన లింగపాలెం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం యడవల్లి గ్రామానికి చెందిన పరస రామారావు (41) పిడుగుపాటుతో మృతి చెందినట్లు తెలిపారు. పశువులను మేపడం కోసం పొలంలో ఉండగా ఘటన జరిగి వ్యక్తితోపాటు గేదె కూడా చనిపోయినట్లు తెలిపారు.

జంగారెడ్డిగూడెం టౌన్: మండలంలోని తాడువాయి గ్రామ పరిధిలోని జొన్నవారిగూడేనికి చెందిన కె.నాగేశ్వరరావు (70) తాడ్వాయిలో మేకలు మేపడానికి వెళ్లాడు. ఆ సమయంలో వర్షం కురిసి పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

బస్తాలపైనే కుప్పకూలి..

ఆచంట: ఆచంట పెద్ద పేటకు చెందిన కౌలురైతు కంకిపాటి శివయ్య (56) మంగళవారం మధ్యాహ్నం ధాన్యం బస్తాలపై బరకం కప్పే ప్రయత్నంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురవడంతో గ్రామ శివార్లలో శ్మశానం పక్కనే ఉన్న లేఅవుట్‌లో ఉన్న ధాన్యం బస్తాలపై బరకం కప్పేందుకు హడావుడిగా వెళ్లాడు. ధాన్యం బస్తాలపై బరకం కప్పుతూ కుప్పకూలిపోయాడు. స్థానికులు హుటాహుటిన ఆచంట సిహెచ్‌సికి తరలించగా అప్పటికే శివయ్య గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శివయ్య ఓపక్క ఆటో నడుపుకుంటూ వ్యవసాయ సాగు కూడా చేస్తున్నాడు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న సాగులో వర్షానికి ధాన్యం తడిస్తే పెట్టుబడులు సైతం రావేమోననే ఆందోళనతోనే శివయ్య గుండెపోటుకు గురై మృతి చెందాడని బంధువులు విలపించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కొబ్బరి చెట్టు విరిగిపడి..

పాలకోడేరు: వరిసాగుపైనే ఆధారపడి జీవిస్తున్న రైతు ఆ పంటను రక్షించుకునేందుకు వెళ్లే మార్గంలో దుర్మరణం పాలయ్యాడు. శృంగవృక్షం గ్రామానికి చెందిన రైతు నిమ్మల శ్రీనివాసు (45) స్థానిక భీమరాజు స్కూల్ ఎదురుగా నివాసం ఉంటున్నారు. శ్రీనివాసుకు సొంతంగా కొంత వ్యవసాయ భూమి ఉంది. ఇది సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం వరి కోత కోసి ధాన్యాన్ని గట్టుపై భద్రపర్చాడు. మంగళవారం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో గట్టుపై భద్రపరచిన ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని బరకం తెచ్చేందుకు కంగారుగా మోటార్ సైకిల్‌పై తన బాబాయ్ సుబ్బారావు ఇంటికి వెళ్లాడు. శ్రీను మోటార్ సైకిల్‌పైనే ఉండి బాబాయ్ అని పిలిచేలోపు సమీపాన కొంతకాలం క్రితం ఎండిపోయి ఉన్న కొబ్బరిచెట్టు విరిగి శ్రీనుపై పడింది. ఈ ఘటనలో శ్రీను అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. శ్రీనివాసుకు భార్య సత్యనాగతులసి, ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడు నాగసాయి గణేష్, డిగ్రీ చదువుతున్న కుమార్తె జమశ్రీ వెంకట స్రవంతి ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. పాలకోడేరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగ శ్రీనివాసరావు తెలిపారు.